లక్కీడిప్‌తో వార్డు మహిళా రిజర్వేషన్లు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందడుగు పడింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. దీనికి అనుగుణంగా అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆయా రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఎంపీడీఓలు లక్కీడిప్ ద్వారా వార్డుల వారీగా మహిళా రిజర్వేషన్లు కేటాయించారు.

మహిళా వార్డు మెంబర్ల ఎంపిక



చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో మహిళా వార్డు మెంబర్ల రిజర్వేషన్లను ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి లక్కీడ్రిప్ ద్వారా ఎంపిక చేశారు. మండలంలో మొత్తం 174 వార్డు మెంబర్లు ఉండగా.. 74 వార్డు మెంబర్ స్థానాలు మహిళలకు కేటాయించినట్లు ఎంపీడీఓ తెలిపారు. 100 వార్డు మెంబర్లను జనరల్ స్థానాలకు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు.

వార్డు మెంబర్ల రిజర్వేషన్లు ఖరారు



మిడ్జిల్: మండలంలోని జీపీ వార్డు మెంబర్లలో మహిళా రిజర్వేషన్ల కోసం శనివారం మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో డ్రా తీశారు. మండలంలో మొత్తం 204 వార్డులకు ఎస్టీలకు 38, ఎస్సీలకు 37, బీసీలకు 77, జనరల్‌కు 52 కేటాయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ నజీర్‌అహ్మద్, వివిధ పార్టీల చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రా పద్ధతిన మహిళా రిజర్వేషన్ కేటాయింపు



గండీడ్: మండలంలో డ్రా పద్ధతిన వార్డుల మహిళా రిజర్వేషన్ తీశారు. శనివారం ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేశారు. మండలంలో 27 జీపీలుండగా 228 వార్డులు ఉన్నాయి. వెన్నాచేడ్, పెద్దవార్వాల్, రుసుంపల్లి, పగిడ్యాల్, సల్కర్‌పేట్, కొంరెడ్డిపల్లి, గండీడ్, రెడ్డిపల్లి తదితర గ్రామాలకు సంబంధించి అన్ రిజర్వుడ్, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి మహిళా రిజర్వేషన్లను డ్రా పద్ధతిలో ఖరారు చేశారు.

భూత్పూర్ ఎంపీపీ బీసీ(మహిళ), జెడ్పీటీసీ బీసీ(జనరల్)



భూత్పూర్: ఎంపీపీగా బీసీ (మహిళ), జెడ్పీటీసీ బీసీ(జనరల్)కు కేటాయించినట్లు సమాచారం. ఆశావహులందరూ నిరాశలో ఉన్నట్లు తెలిసింది. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వార్డుసభ్యుల రిజర్వేషన్‌కు మండలంలోని వివిధ పార్టీల నాయకులతో అధికారులు సమావేశమయ్యారు. వార్డుసభ్యుల రిజర్వేషన్లను ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీదేవి ప్రకటించారు. 2011జనాభా లెక్కల ప్రకారం 42శాతం బీసీ రిజర్వేషన్ ఖరారు చేశారు. 74మంది మహిళలు, 100 మంది జనరల్‌గా రిజర్వేషన్ ఖరారు చేశారు. భూత్పూర్ మండంలో 19 జీపీలకు 174 వార్డులున్నాయి. ఎస్టీ (మహిళ) 13, ఎస్టీ (జనరల్)14, ఎస్సీ (మహిళ)12, ఎస్సీ (జనరల్) 19, బీసీ (మహిళ) 28, బీసీ (జనరల్) 37, అన్ రిజర్వ్‌డ్ (మహిళ)21, అన్‌రిజర్డ్ (జనరల్) 30 కేటాయించారు.

నవాబుపేట జెడ్పీటీసీ ఎస్సీ మహిళ, ఎంపీపీ బీసీ



నవాబుపేట: మండలంలో స్థానిక సమరానికి సంబంధించి జెడ్పీటీసీ స్థానం ఎస్సీ మహిళకు కేటాయించినట్లు సమాచారం. ఎంపీపీ స్థానం బీసీకి కెటాయించినట్లు తెలిసింది.

వార్డు రిజర్వేషన్లు పూర్తిచేశాం

వార్డుల వారీగా రిజర్వేషన్లు పూర్తి చేసి జిల్లా అధికారులకు పంపించామని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీల ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి వార్డుల రిజర్వేషన్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వీటిపై జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం విడదల చేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



అన్నపూర్ణాదేవిగా రేణుకాల ఎల్లమ్మ అమ్మవారు



భువనేశ్వరీదేవిగా పర్వతాపూర్ మైసమ్మ



దేవరకద్రలో వెంకటేశ్వరస్వామిగా వాసవీమాత

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పట్టణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. వేడుకల్లో భాగంగా శనివారం పట్టణంలోని పలు శక్తి ఆలయాల్లోని అమ్మవారి విగ్రహాలను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. బ్రాహ్మణవాడిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలత్రిపురా సుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. రేణుక ఎల్లమ్మ ఆలయంలో అన్నపూర్ణదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీనగర్‌కాలనీలోని శ్రీమాతా రాజారాజేశ్వరి ఆలయంలో శాకాంబరి దేవి రూపంలో అలకరించారు.

భగత్‌సింగ్‌కు నివాళి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్ నుంచి క్లాక్‌టవర్ మీదుగా న్యూటౌన్‌లో భగత్‌సింగ్ విగ్రహం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ప్రశాంత్, కో కన్వీనర్ భాను ప్రసాద్, ప్రవీణ్, విజయ్, వంశి, భాస్కర్, అంజి, సాయి తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇల్లు పరిశీలన

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లిలో రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మంగళి రాములు ఇల్లు కూలింది. శనివారం తహసీల్దార్ భారతి వచ్చి పరిశీలించారు. కూలిన ఇంట్లో ఎవరూ ఉండొద్దని, సురక్షితమైన ఇంట్లో ఉండాలని సూచించారు. మండలంలో ప్రజలు ఎవరూ శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉండవద్దని తహసీల్దార్ సూచించారు.

వాసవీ డిగ్రీ కాలేజీలో న్యాయ అవగాహన సదస్సు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి మమతారెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా మైనర్లకు రక్షణ కల్పించే పోక్సో చట్టంపై పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఏ వ్యక్తి హక్కులకు భగం కలిగించకుండా, బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలన్నారు. కార్యక్రమంలో 4వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భువన, అకాడమిక్ డైరెక్టర్ రజనీకాంత్, ప్రిన్సిపాల్ కొండస్వామి పాల్గొన్నారు.

'వెల్ఫేర్ బోర్డు నిధులను మళ్లించొద్దు'

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కార్మికుల వెల్ఫేర్

సంక్షిప్తంగా..

బోర్డు నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీలకు మళ్లించే చర్యలను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి సోమయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 8వ మహాసభలలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీఓ 12ను సవరించి వెల్ఫేర్ బోర్డు నుంచే సంక్షేమ పథకాలను కార్మికులకు నేరుగా అందించాలన్నారు. అక్రమంగా ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చిన రూ.346.36 కోట్లు తిరిగి వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్, జిల్లా కార్యదర్శి కురుమూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి గాలెన్న మాట్లాడారు. అనంతరం మహాసభల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోనెల రాములు, కార్యదర్శిగా వరద గాలెన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీపీ మండల్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీల ఆరాధ్యుడు, సమస్త బీసీ కుల రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దామని యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు అంజన్నయాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్‌లో బీపీ మండల్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి బీసీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలోయాదవ విద్యావంతుల వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

మిడ్జిల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల నిర్వహణపై పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో వారి బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ నజీర్, ఎన్నికల శిక్షణ అధికారులు శ్రీశైలం, మోహన్, సందీప్, శ్రావణ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక

గండీడ్: సామాజిక తనిఖీ ప్రజావేదిక రెండోరోజు కొనసాగింది. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. గండీడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలోని కొండాపూర్, పగిడ్యాల్, రెడ్డిపల్లి, రంగారెడ్డిపల్లి, గాధిర్యాల్, చిన్నాయిపల్లి, షేక్‌పల్లి, మంగంపేట్, ఎల్కిచెరువు, నంచర్ల తదితర గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో పలురకాల అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం నిర్ధారించారు. దీనికి సంబంధించి రికవరీకి నివేదించినట్లు అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదా బేగం పేర్కొన్నారు. సామాజిక తనిఖీలో విజిలెన్సు ఆఫీసర్ ప్రేమలత, అంబుడ్స్‌మెన్ సంతోష్, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఏపీఓ హరిశ్చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మాంస వ్యర్థాలకు రూ.20.60లక్షలు

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో చికెన్, మటన్, చేపలు తదితర మాంస వ్యర్థాల సేకరణ టెండర్ వేలం ప్రక్రియ శనివారం సజావుగా ముగిసింది. 2025–26 సంవత్సరానికి గాను నిర్వహించిన బహిరంగ వేలంలో వివిధ ప్రాంతాల నుంచి నలుగురు వ్యక్తులు పాల్గొన్నారు. వేలంలో పరశురాముడు రూ. 20.60 లక్షలకు టెండర్‌ను దక్కించుకున్నాడు. టెండర్ దక్కించుకున్న వ్యక్తిని ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి తదితర సభ్యులు శాలువా కప్పి అభినందించారు.

భగీరథ పైపులైన్ లీకేజీ

జడ్చర్ల: జడ్చర్ల వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ శనివారం లీకేజీ ఏర్పడింది. లీకేజీ కారణంగా పెద్ద ఎత్తున నీరు ఎగిసి పడింది.దాదాపు 50 అడుగుల ఎత్తు నీరు ఎగిసి రహదారిపై పడింది. దీంతో సర్వీస్ రోడ్డుతోపాటు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. వెంటనే స్థానిక మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తదితర మిషన్ భగీరథ అధికారులు స్పందించి నీటి సరఫరాను నిలుపదల చేసి మరమ్మతులు చేపట్టారు.



బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత



గ్రీన్‌బెల్ట్‌లో కొండా లక్ష్మణ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు, నాయకులు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘననివాళి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/మెట్టుగడ్డ/జడ్చర్ల/స్టేషన్ మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ : బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి సందర్భంగా శనివారం పద్మావతికాలనీ గ్రీన్‌బెల్ట్‌లో కొండా లక్ష్మణ్ విగ్రహానికి కలెక్టర్ విజయేందిరతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిజమైన త్యాగానికి నిలువెత్తు నిదర్శనం కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు నిరంతరం కృషి చేసిన వ్యక్తి అని కొనయాడారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, బీసీ సంక్షేమ సంఘం అధికారి ఇందిర, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఆశ కార్యకర్తల సేవలు అమోఘమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని నియోజకవర్గానికి చెందిన ఆశ కార్యకర్తలకు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీప్రసన్న చీరలు అందజేశారు. అనంతరం ఆశ కార్యకర్తలతో కలిసి బతుకమ్మ ఆడారు.
- పీయూలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి ఎంఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు బషీర్, రాజ్‌కుమార్, అర్జున్‌కుమార్, విశ్వనాథ్, జయనాయక్, విజయలక్ష్మి, అరుంధతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- బీసీ మేధావుల సంఘం జిల్లా కార్యాలయంలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్, భానుప్రతాప్, రవికుమార్, సురేందర్‌గౌడ్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.
- తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమానికి ఆచార్య కొండా



నివాళులర్పిస్తున్న బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్

లక్ష్మణ్ అందించిన స్ఫూర్తి, త్యాగం మరువలేనిదని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ అన్నారు. కాలనీ గ్రీన్ బెల్ట్‌లోని కొండా లక్ష్మణ్ విగ్రహానికి వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఈఓ విజయ్‌కుమార్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్, కుమ్మరి సంఘం అధ్యక్షుడు బుగ్గన్న, అజయ్‌కుమార్ యాదవ్, భీంపల్లి శ్రీకాంత్, అశ్విని శేఖర్, డీకే నాయి, తదితరులు పాల్గొన్నారు.

- జడ్చర్ల మున్సిపల్ కార్యాయలంలో చైర్‌పర్సన్ పుష్పలత కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సరిత, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధగా బీసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలోకృష్ణయాదవ్, శ్రీనివాస్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సేవలు అమోఘం

- బీసీ జనచైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు దాసరి అజయ్‌కుమార్ యాదవ్ జిల్లాకేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కొండా లక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

దేవరకద్ర: భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కోరారు.శనివారం ఉదయం కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సందర్శించారు. వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు ప్రాజెక్టులోకి చేరుతున్నదని.. ఎప్పటికప్పుడు గేట్ల ను తెరిచి నీటిని విడుదల చేస్తున్నారని దీనివల్ల వాగు పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ఎక్కువైతే గేట్ల సంఖ్యను పెంచే అవకాశం ఉంటుందని వాగు సమీప గ్రామాల ప్రజ లు వాగును దాటొద్దని కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టు గేట్లను పరిశీలించారు. గేట్లలో ఎ లాంటి సమస్యలు లేవని ప్రాజెక్టు సిబ్బంది తెలిపారు.

చిన్నచింతకుంట: మండలంలోని అల్లీపురం సమీపంలోని ఊకచెట్టు వాగుపై బ్రిడ్జిని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శనివారం పరిశీలించారు. ఊక చెట్టువాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున అల్లిపురం వాగు బ్రిడ్జిపై రాకపోలు నిలిపివేయాలని ఆదేశించారు. అనంతరం కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లయ్య, ఆర్‌ఐ తిరుపతయ్య పలువురు ఉన్నారు.

గ్రూప్‌-1లో 'పాలమూరు' మెరికలు

- రైతు ఇంట్లో ఇద్దరికి ఉద్యోగాలు
- అన్న డీఎస్పీ, సోదరి మున్సిపల్ కమిషనర్



అరుణ్‌కుమార్



జోత్స్న

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ పంచాయతీ సత్రోనిపల్లితండాకు చెందిన గిరిజన కుటంబంలో ఇద్దరు గ్రూప్–1 ఉద్యోగాలు సాధించారు. కాగా వారిలో ఒకరు డీఎస్పీగా, మరొకరు మున్సిపల్ కమిషనర్‌గా నియామకమయ్యారు. సత్రోనిపల్లి గిరిజన తండాకు చెందిన తారాభాయి, చందర్‌నాయక్ కుమారుడు విస్లావత్ అరుణ్‌కుమార్ గ్రుప్–1లో 135 ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. ఆయన సోదరి విస్లావత్ జోత్స్న మున్సిపల్ కమిషనర్‌గా నియామితులయ్యారు. అరుణ్ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కొల్లూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించగా.. జోత్స్న గురుకుల పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసింది. తల్లి అంగన్‌వాడీ టీచర్, తండ్రి వ్యవసాయం రైతు. మారుమూల గ్రామానికి చెందిన గిరిజన కుటుంబంలో ఒకే ఇంట్లో ఇద్దరికి గ్రూప్–1లో ఉద్యోగాలు రావడంపై తల్లిదండ్రులను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు అభినందించారు. శనివారం సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా నిజాలాపూర్ యువకుడు



తల్లిదండ్రులతో వెంకటేశ్ ప్రసాద్

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్‌కు చెందిన వెంకటేశ్ ప్రసాద్‌సాగర్ గ్రూప్–1లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మార్చి 30 వెలువడిన గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 27వ ర్యాంకు, మల్టిజోన్‌లో 12వ ర్యాంకు సాధించాడు. డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైనట్లు శనివారం హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకున్నాడు. వెంకటేశ్ ప్రసాద్ తండ్రి సత్యయ్యసాగర్ ప్రస్తుతం విద్యుత్‌శాఖ ఏఈగా పని చేస్తూ కొన్నేళ్ల నుంచి కుటుంబంతో కలిసి మహబూబ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. తల్లి యశోద గృహిణి. మొదటి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాడు. చిన్నప్పటి నుంచి ఐఏఎస్ కావాలన్న పట్టుదలతో చదివినట్లు వెంకటేశ్ ప్రసాద్ తెలిపారు. ఇదిలా ఉండగా ఏప్రిల్‌లో విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 700 ర్యాంకు సాధించాడు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం గణేశ్‌నగర్‌లోని ఎస్‌బీఐ గల్లీతోపాటు రాయచూర్ మెయిన్ రోడ్డుపై నిలిచిన వరద నీటిని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. పాటుకాల్వ ద్వారా వరద సాఫీగా ముందుకు వెళ్లేలా వెంటనే చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీకి సూచించారు. ఇక ఇప్పటికే నిండి అలుగు పారుతున్న కొత్తచెరువు వరద నీరు కిందికి మదునగర్ మీదుగా పాటుకాల్వలో ఉధృతంగా పారుతోంది.



ఎస్‌బీఐ గల్లీలో నిలిచిన వరదనీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బాలనగర్ మండలంలో ట్రిబుల్ ఆర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చే వరకు పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ట్రిబుల్ ఆర్ మూడో అలైన్‌మెంట్ తీసుకోవడం వల్ల పేద గిరిజన, దళిత బలహీనవర్గాల రైతుల జీవితాలు ఛిద్రమవుతున్నాయని అన్నారు. రైతులను ఆగం చేసే అలైన్‌మెంట్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఓ సువర్ణరాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు దీప్లానాయక్, రాజ్‌కుమార్, భరత్, సురేశ్, రైతులు కృష్ణయ్య, శ్రీనునాయక్, రమేశ్‌నాయక్, శ్రీశైలం, రాములు, కిషన్, యాదమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఎన్నికలు సాఫీగా కొనసాగేలా చూడాలి

గండీడ్: స్థానిక ఎన్నికలు సాఫీగా సాగేలా ఎన్నికల సిబ్బంది వ్యవహరించాలని ఎంఈఓ జనార్దన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ఎన్నికలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ సమయంలో సిబ్బంది ఓటింగ్ సజావుగా సాగేందుకు సహకరించాలన్నారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరెడ్డి, ఐటీసెల్ కన్వీనర్ వెంకటేశ్, జిల్లా కార్యదర్శులు ఖాదర్, బాల్‌రాజు, రామానాయుడు, రాఘవేందర్‌రావు, ప్రేమ్‌రాజు, సంజీవ్‌కుమార్, సాయికుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల సంత అభివృద్ధికి కృషి

జడ్చర్ల: కావేరమ్మపేటలో కొత్తగా ప్రారంభించిన గొర్రెలు, మేకల సంతకు మంచి స్పందన వచ్చిందని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం సంతను పాలక మండలి సభ్యులతో కలిసి పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి గొర్రెలు, పొట్టేళ్ల విక్రయానికి తరలివచ్చాయన్నారు.క్రయవిక్రయదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూగజీవాలకు తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. క్రయవిక్రయదారులకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్‌కార్డు నుంచి నగదు మాయం

రాజాపూర్: బండిలో పెట్రోల్ పోయించుకునేందుకు పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లిన వ్యక్తి ఫోన్‌కు తన క్రెడిట్ కార్డు నుంచి నగదు బదిలీ అయినట్లు మెసేజ్ రావడంతో ఖంగుతిన్న వ్యక్తి శనివారం రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలోని మల్లేపల్లికి చెందిన కమ్మరి లింగమాచారి ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 25న రాజాపూర్‌లోని ఓ పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్ పోయించుకుందామని ఫోన్ తీయగా.. తన ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డులో నుంచి రూ.30వేలు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఫ్లిప్‌కార్డు ఇన్‌టర్న్ అనేవారు అమౌంట్ తీసినట్లు ఐసీఐసీఐ కస్టమర్ కేర్‌కు సమాచారం ఇస్తే కార్డుబ్లాక్ చేశారని తిరిగి ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డు నుంచి రూ.30వేలు మూడుసార్లు 90వేలు డెబిట్ అయ్యాయి. వెంటనే 1930 సైబర్ క్రైమ్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లు నా క్రెడిట్‌కార్డుల నుంచి మొత్తం లక్షా40వేలు దొంగిలించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసును మోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు.

ఉప్పొంగిన ఊకచెట్టువాగు

చిన్నచింతకుంట: రెండురోజులుగా ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షాలకు శనివారం ఉమ్మడి చిన్నచింతకుంట మండలంలోని చెరువులు, వాగులు, కుంటలు నిండి అలుగులు పారాయి. ఉంద్యాల, అల్లీపురం, చిన్నచింతకుంట, పర్ధిపురం, తిర్మలాపురం, అప్పంపల్లి, ముచ్చింతల చెరువులు పూర్తిగా నిండి అలుగులు పారాయి. కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని కిందకు వదలడంతో ఊకచెట్టు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది.

